క్లుప్తంగా

న్యాయం చేయకుంటే ఆందోళన తీవ్రతరం



మునగపాకలో ఆందోళన చేస్తున్న నిర్వాసితుల సంక్షేమ సంఘం సభ్యులు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని, లేకుంటే రానున్న రోజుల్లో తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగుతామని నిర్వాసితుల సంక్షేమ సంఘ సభ్యులు హెచ్చరించారు. నిర్వాసితులతో వీఎంఆర్‌డీఏ ఆటలాడుకోవడం తగదన్నారు. ఆదివారం మునగపాకలో సీఐటీయూ నేత బ్రహ్మాజీ మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం బాధితులకు పరిహారం అందించాలన్నారు. టీడీఆర్ బాండ్లు కాకుండా నగదు నేరుగా అకౌంట్‌లో జమ చేయాలన్నారు. తక్కువ గడువిచ్చి అభ్యంతరాలు ఉంటే చెప్పాలని ప్రకటన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆడారి శ్రీనివాసనాయుడు, పెంటకోట అప్పలనాయుడు, విల్లూరి జగన్నాథరావు, బొడ్డేడ జగ్గారావు, పాలమరశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా శ్మశాన వాటిక అభివృద్ధి పనులు



శ్మశానవాటికలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న పెద్దలు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. తిమ్మరాజుపేట ఎంపీటీసీ శరగడం అప్పలనరసమ్మ తన కోటా ద్వారా మంజూరైన రూ.3 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధికి కేటాయించారు. సంబంధిత పనులను ఆదివారం గ్రామ పెద్దలు పరిశీలించారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు ఇతర పాలకవర్గ సభ్యుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్లు ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీను, పెద్దలు బీవీ రమణ, దొడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు స్వెట్టర్లు, నిత్యావసర సరకుల పంపిణీ



గవర్ల అనకాపల్లిలో స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవాటు చేసుకోవాలని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ కోరారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో దివంగత ఆళ్ల వరలక్ష్మి జ్ఞాపకార్థంగా ఆమె కుమారుడు శ్రీనివాసరావు సమకూర్చిన స్వెట్టర్లు, నిత్యావసర సరకులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ అమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో ఏటా వరలక్ష్మి పేరిట సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను అభినందించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజా శ్రేయస్సు కోసం ఇటువంటి సాయం అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పెద్దలు దాడి శ్రీనివాసరావు, పరమేష్, ఆనంద్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ



బయపురెడ్డిపాలెం బ్రిడ్జి వద్ద స్తంభించిన ట్రాఫిక్

నర్సీపట్నం: నర్సీపట్నం నుంచి తుని వెళ్లే మార్గంలో బయపురెడ్డిపాలెం వంతెనపై కారు, బైక్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదం కారణంగా నర్సీపట్నం నుంచి తుని వెళ్లే వాహనాలు, తుని నుంచి నర్సీపట్నం వచ్చే వాహనాలు వంతెనపై నిలిచిపోయాయి. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు సుమారు 40 నిమిషాలు సమయం పట్టింది.

30 మంది యువకుల రక్తదానం

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెంలో 30 యువకులు రక్తదానం చేశారు. సర్పంచ్ వొబ్బలరెడ్డి రమణ జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు ప్రారంభించారు. మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, మాజీ అధ్యక్షుడు వాసు పాల్గొన్నారు.

జోరందుకున్న వరినాట్లు

ఖరీఫ్ ప్రారంభం నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో వరిసాగుపై రైతులు ఆశలు వదులుకున్నారు. ఈ తరుణంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు ఊరట కలిగించాయి. దాంతో ఉత్సాహంతో సాగుకు ఉపక్రమించారు. దాంతో ఓ వైపు వ్యవసాయ కూలీలకు చేతినిండా పని కలిగింది. మరోవైపు వరినాట్లు జోరందుకున్నాయి. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 70 శాతం వరినాట్లు పూర్తయ్యాయి.



పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు



నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

- ఇప్పటి వరకు 70 శాతం పూర్తి
- 24 వేలకుగాను 16 వేల ఎకరాల్లో నాట్లు
- కూలీలకు చేతినిండా పని



దొంకాడలో రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్న సిబ్బంది

నక్కపల్లి: నెల రోజుల క్రితం వరకు ఖరీఫ్‌పై ఆశలు సన్నగిల్లిన రైతుల్లో ఇటీవల కాలంలో మారిన వాతావరణ పరిస్థితులు, అడపా దడపా పడుతున్న వర్షాలు కారణంగా వరినాట్లు వేసే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. కూలీలకయితే ఆగస్టు మొదటి వారం నుంచి సెప్టెంబరు చివర వరకు చేతి నిండా పని కలిగినట్లే కనిపిస్తోంది. జూలై నెలాఖరు నాటికే 50 శాతం వరినాట్లు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో ఆందోళన చెందారు. ఆగస్టు నుంచి విస్తారంగా వర్షాలు పడటంతో నారు మడులు మొలకెత్తాయి. దీంతో రైతులు దుక్కులు, దమ్ము పనులను వడివడిగా పూర్తి చేశారు. నారు మొలకెత్తినప్పటికీ నాట్లు వేసేందుకు అవసరమైన నీటి సదుపాయం లేకపోవడం వర్షాలు పడకపోవడంతో ఆందోళన చెందిన రైతులకు తాజాగా మారిన వాతావరణ పరిస్థితులు ఉపశమనం కలిగించాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నాట్లు వేసేందుకు అవసరమైన నీరు అందుబాటులోకి రావడంతో వరినాట్లు జోరందుకున్నాయి.

పుష్కలంగా జలాలు

నియోజకవర్గంలో వరి సాధారణ విస్తీర్ణం 24 వేల ఎకరాలు కాగా, ఆగస్టు నెలాఖరు నాటికి 16 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. ఎస్.రాయవరం మండలంలోనే వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. పోలవరం కాలువలో పుష్కలంగా నీరు చేరడంతో దీనికి అనుకున్న గ్రామాల్లో వరినాట్లు జోరందుకున్నాయి. అదేవిధంగా తాండవ కాలువకు అనుబంధంగా ఉన్న భూమి కాలువ, ఆవ, ముఠా, గ్రోయిన్లు, మంగవరం, గోపా లపట్నం గ్రోయిన్ల ద్వారా తాండవ జలాలు కూడా విడుదల కావడంతో ఆయకట్టులో వరినాట్లు ఊపందుకున్నాయి.



కలుపుతీతలో రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

మరోవైపు పొలం పిలుస్తోందిలో భాగంగా వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనలతో రైతులకు వరినాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇప్పటివరకు వరినాట్లు పూర్తయిన వివరాలు ఎకరాల్లో..

మండలం	వరి సాధారణ విస్తీర్ణం	వరినాట్లు పూర్తి
నక్కపల్లి	4,750 ఎకరాలు	3,125
పాయకరావుపేట	6,200	4,900
ఎస్.రాయవరం	8,500	4500
కోటవురట్ల	4,500	3200

కూలీలకు డిమాండ్

నియోజకవర్గంలో ఎరువుల గోదాములను తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు 12 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేసినట్లు భోగట్టా.. ఎస్. రాయవరంలో ఎరువుల కొరత ఉందని రైతుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వ్యవసాయ కూలీలకు చేతినిండా పని కలుగుతోంది. మగవారికి ఆకుతీత, పారపనికి రోజుకు రూ.800 నుంచి రూ.వెయ్యి పైనా, నాట్లు వేసే ఆడవారికి రూ.300 నుంచి రూ.400 వరకు కూలి చెల్లిస్తున్నారు. కూలీల కొరత కారణంగా చుట్టుపక్కల గ్రామాల రైతులు ప్రత్యేకంగా ఆటోలను ఏర్పాటు చేసి కూలీలను తీసుకెళ్లే పరిస్థితి నెలకొంది.

> **కలుపుపై రైతులు దృష్టి పెట్టాలి**
>
> వర్షాలు విస్తారంగా పడటం వల్ల చురుగ్గా వరినాట్లు వేస్తున్నారు. నాట్లు పూర్తయిన పొలాల్లో కలుపుపై రైతులు దృష్టి పెట్టాలి. కలుపు నివారణకు మందులు సాధ్యమైనంత వరకు ఉదయం మాత్రమే పిచికారీ చేయాలి. కలుపు మందు పిచికారీ చేసిన తర్వాత నాలుగు గంటల వరకు వర్షం పడకుండా ఉంటే మంచిది.
>
> – ఉమాప్రసాద్ ఏడీఏ, నక్కపల్లి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు క్షేత్రస్థాయి పర్యటన

ఉద్దండపురం, కాగిత, మనబాన వానిపాలెం, గొడిచర్ల గ్రామాల్లో శనివారం జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. రైతులతోపాటు వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాట్లు పూర్తయ్యాయని, కలుపుతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. నాట్లు వేసిన మూడు రోజుల లోపు ఆక్సా డయార్జిల్ పొడి మందు 35 గ్రాములు లేదా ప్రిటిలాక్లోర్ 500 మిల్లీలీటర్లు ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి బురద పదును మీద పొలం మొత్తం చల్లితే కలుపు రాకుండా నియంత్రించవచ్చన్నారు. నాట్లు వేసిన 18 రోజులకు బిస్పైరివాక్ సోడియంను 80 నుంచి 100 మిల్లీ లీటర్లు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే సాధారణ కలుపుతోపాటు తీగ నియంత్రించవచ్చని సూచించారు. ఈయన ఇప్పటి వరకు ఐదు పర్యాయాలు నియోజకవర్గంలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు.

నిమజ్జనాలు..అన్న సంతర్పణలు

యలమంచిలి రూరల్: పట్టణంలో వినాయక నిమజ్జనాల సందడి నెలకొంది. పలుచోట్ల నెలకొల్పిన గణేశ ప్రతిమల అనుపు కార్యక్రమాలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. బొజ్జగణపయ్య విగ్రహాలను ఘనంగా ఊరేగిస్తూ స్థానిక సైతారుపేట రోడ్డు పెంజెరువులో నిమజ్జనం చేశారు. గణేశ ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లే వాహనాల ముందు కోలాటాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం పట్టణంలో పలుచోట్ల అన్నసంతర్పణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వీటికి భారీగా స్థానికులు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిమజ్జనోత్సవంలో జాగ్రత్త వహించండి



పూడిమడక తీరంలో వినాయకుని నిమజ్జనంలో సూచనలు చేస్తున్న మెరైన్ ఎస్ఐ పైడిరాజు

అచ్యుతాపురం రూరల్: పూడిమడక తీరంలో ఆదివారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మెరైన్ సీఐ ఎస్.సింహాద్రినాయుడు, ఎస్ఐ జి.పైడిరాజు ఉత్సవ కమిటీ సభ్యులను పలు జాగ్రత్తలు సూచించారు. మండలంలో పూడిమడక, తంతడి తీరాల్లో వినాయకుని నిమజ్జనానికి తీసుకెళ్లే ఉత్సవ కమిటీ సభ్యులు అధికారుల సూచనల మేరకు సముద్రంలో విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

'అమరత్వం' కవితకు పురస్కారం

అనకాపల్లి టౌన్: రాష్ట్ర స్థాయి కవితల పోటీల్లో మండలంలోని కూండ్రం హైస్కూల్ తెలుగు మాస్టార్ కోరాడ అప్పలరాజు రాసిన కవితకు ఉత్తమ పురస్కారం లభించింది. మచిలీపట్నం సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో దేశభక్తి అంశంపై అమరత్వం శీర్షికతో రాసిన కవిత ఎంపికైంది. ఈ పోటీల్లో 300 మంది పాల్గొని తమ కవితలను ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అప్పలరాజును ఘనంగా సత్కరించి, ఉత్తమ బహుమతి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

వామ్మో... ఒడ్డిమెట్ట పెట్రోలు బంకులో మోసాలు

- కొలతల్లో అరలీటరు తేడా
- కొనుగోలుదారుల ఆగ్రహం



ఒడ్డిమెట్ట సమీపంలో పెట్రోలు బంకు



పెట్రోలు కొలతలో తేడా రావడంతో సిబ్బందిని నిలదీస్తున్న కొనుగోలుదారులు

నక్కపల్లి: జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో హెచ్‌పీ పెట్రోలు బంకులో మోసాలు జరుగుతున్నాయంటూ కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. ఎక్కువ మొత్తంలో పెట్రోలు కొనుగోలు చేస్తే తక్కువ వస్తోందని వాపోతున్నారు. ఇలా సిబ్బంది చేతివాటం ప్రదర్శించడాన్ని ఆదివారం కొంతమంది కొనుగోలుదారులు గుర్తించి సిబ్బందిని నిలదీశారు. ఉద్దండపురానికి చెందిన ఒక కొనుగోలుదారు రూ.400తో రెండు బాటిళ్లలో పెట్రోలు పోయించుకున్నాడు. అతనికి అర లీటరు పెట్రోలు తక్కువ వచ్చింది. తర్వాత మరో కొనుగోలుదారు రూ.200 పెట్రోలు కొనుగోలు చేశాడు. బాటిళ్లలో పోసిన పెట్రోలు 1.800 మిల్లీలీటర్ల రావాల్సి ఉండగా, 1.250 మిల్లీలీటరు మాత్రమే వచ్చింది. రీడింగ్ మాత్రం 1.800 మిల్లీలీటర్లు చూపిస్తోందని ఆరోపించారు. ఈ తేడాలపై బంకులో పనిచేస్తున్న గుమస్తా వద్ద ఆధారాలతో సహా నిలదీయగా మిషన్‌లో సమస్య ఉన్న కారణంగా పెట్రోలు తక్కువ వస్తోందని బుకాయించాడు. తాము కొనుగోలు చేసిన మొత్తానికి సరిపడా పెట్రోలు రావడం లేదని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాలను గమనించకుండా చాలా మంది తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ బంకులో ఉూకంలో మోసాలు చాలా రోజుల నుంచి జరుగుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఒడ్డిమెట్ట బంకులోనే కాకుండా జాతీయ రహదారిపై పాయకరావుపేట నుంచి అడ్డురోడ్డు వరకు రహదారికి ఇరువైపులా ఉన్న బంకుల్లో ఇదే తరహా మోసాలు జరుగుతున్నాయంటూ ఆరోపిస్తున్నారు.

7న జిల్లా సేవాదళ్ ట్రైనింగ్ క్యాంప్

దేవరాపల్లి: అనకాపల్లిలో సెప్టెంబర్ 7న నిర్వహించే జిల్లా సేవాదళ్ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు కోరారు. మండలంలోని పెదనందిపల్లిలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ సమావేశం జోనల్ ఇన్‌చార్జి రవిశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ వెయ్యి మంది సేవాదళ్ సభ్యులతో ట్రైనింగ్ నిర్వహించడం లక్ష్యమన్నారు.

ఘనంగా అన్నసమారాధనలు

దళితవాడ రామాలయం అభివృద్ధికి విరాళం

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అన్నసమారాధనలు ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునగపాక దళితవాడ, మూలపేట, మునగపాక బీసీ కాలనీల్లో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలను భక్తులు దర్శించుకున్నారు. దీనిలో భాగంగా మునగపాక దళితవాడకు చెందిన దివంగత మైలపల్లి అప్పారావు, నారాయణమ్మ కుమారుడు ఎంవీఆర్‌పీ నాయుడు(ఎస్ఐ), నళిని దంపతులు రామాలయం అభివృద్ధికి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, రామాలయ కమిటీ చైర్మన్ దిమ్మల శివ, కాలనీ వాసులు కోనపల్లి రామ్మోహనరావు, పిల్లి అప్పారావు, బీలా లక్ష్మణరావు, బీలా అప్పలనాయుడు, శివ గణేష్, రాజాన అప్పారావు, అనిల్‌కుమార్ తదితరులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



అంబేడ్కర్ కాలనీలో వినాయకున్ని దర్శించుకుంటున్న భక్తులు



దళితవాడ రామాలయం అభివృద్ధికి విరాళం అందజేస్తున్న ఎస్ఐ నాయుడు దంపతులు

అన్నసమారాధనకు భారీగా తరలివచ్చిన భక్తులు

కోటవురట్ల: బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో స్థానిక సీతారామరాజునగర్‌లో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించేందుకు సమీప గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వీరికి ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



కోటవురట్ల సీతారామరాజునగర్‌లో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

రూ.46 వేలు పలికిన గణపతి లడ్డూ



గణపతి లడ్డూను దక్కించుకున్న భక్తులు

ఎస్.రాయవరం: మండల వాణిజ్యకేంద్రం అడ్డురోడ్డు జంక్షన్‌లో సిద్ధిపతి గణపతి మండపం వద్ద లడ్డూ వేలం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇక్కడ 28 సంవత్సరాలుగా చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద లడ్డూకు వేలం పాట నిర్వహించారు. భక్తులు కర్రి చంద్రశేఖర్, సూరిబాబు అత్యధికంగా రూ.46 వేలకు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూ అందజేశారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన నగదుతో అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు.

విఘ్నాలు తొలగించు వినాయక



వినాయకుని నిమజ్జనోత్సవంలో అచ్యుతాపురం పోలీస్ కుటుంబ సభ్యులు

నిమజ్జనోత్సవంలో పోలీస్ కుటుంబ సభ్యులు

అచ్యుతాపురం రూరల్: విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం వినాయక నిమజ్జనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అచ్యుతాపురంలో వీరు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వినాయకుని ఊరేగింపులో పాల్గొని నృత్యాలు చేశారు. విఘ్నాలు తొలగించు వినాయక అంటూ వేడుకున్నారు. అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఈ సందర్భంగా సీఐ నమ్మి గణేష్ కోరుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, సిబ్బంది అనిల్, నర్సింగరావు, బంగార్రాజు, వెంకటేష్, భరత్, గౌరినాయుడు, రామకృష్ణ, సన్నిబాబు, నాయుడు, రమణ, రవికుమార్, శ్రీనివాస్, భవానీ, ఆశ, లక్ష్మి, శ్రీదేవి, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



స్వామి ఎదుట నృత్యం చేస్తూ ఉత్సాహంగా సాగనంపుతున్న పోలీసు సిబ్బంది

ఆయుర్వేదంలో క్లిష్టమైన రోగాలు నయం

అనకాపల్లి ఆయుష్మాన్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కొండా లావణ్య



అనకాపల్లి ఆయుష్మాన్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి లావణ్యకి సన్మాన దృశ్యం

కశింకోట: ఆయుర్వేదం భారత దేశీయ వైద్యమని, చాలా ఏళ్లుగా అనేక క్లిష్టమైన రోగాలను సైతం నయం చేసిన ఘన చరిత్ర ఉందని అనకాపల్లి ఆయుష్మాన్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కొండా లావణ్య తెలిపారు. కశింకోటలోని అగ్రహారంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 'వైద్యో నారాయణో హరి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేదంలో అనేక వ్యాధులకు ఆపరేషన్ అవసరం లేకుండా నయం చేయడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేదంలో నయమవుతాయన్నారు. సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద వైద్యాన్ని ఆచరించి ఆరోగ్యవంతంగా ఉండాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం ఆచరించాలన్నారు. వీటితో ఆరోగ్యం సమకూరుతుందన్నారు. అనంతరం పేరి పృథ్వీచరణ్‌శర్మ, తాతపూడి సీతారామాంజనేయ శాస్త్రిల ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు ప్రదర్శించి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యురాలు లావణ్యను దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు.

అపూర్వ కలయిక



ఆత్మీయ కలయికకు హాజరైన 2004-05 బ్యాచ్ విద్యార్థులు

కె.కోటపాడు : గొండుపాలెం జెడ్పీ హైస్కూలులో చదువుకున్న 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన 25 మంది పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలతో సరదాగా గడిపారు. పూర్వపు విద్యార్థులు వి.గోవింద, దేముడు బాబు, అప్పారావు, సతీష్‌నాయుడు,తాతారావు, రాజశేఖర్, సత్యవేణి, భారతి, ఎర్రయ్యమ్మ, చెల్లయ్యమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.